సాక్షి
విజయనగరం

శనివారం ꠰ 3 ꠰ జూన్ ꠰ 2023



రెంటికీ చెడ్డ రేవడిలా..!

శతాబ్దం క్రితం జరిగిన పొరపాటు ఆ గ్రామ రైతుల పాలిట శాపంగా మారడంతో నేటికీ అవస్థలు పడుతున్నారు. - 8లో



కుమిలిలో మైనింగ్ ప్రాంతం పరిశీలన

పూసపాటిరేగ మండలంలోని కుమిలి కొండ సర్వే నంబర్-1లో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని రెవెన్యూ, అటవీ, మైనింగ్‌శాఖల అధికారులు శుక్రవారం పరిశీలించారు. - 8లో

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలకు బదిలీ

విజయనగరం ఫోర్ట్: ఆర్‌డబ్ల్యూఎస్‌లో అసిస్టెంట్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న పలువురిని బదిలీ చేస్తూ శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆర్.వి.కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఏఈ వి.విశాలక్ష్మికి ఎల్.కోట ఏఈగా, చీపురుపల్లిలో ఏఈగా పనిచేస్తున్న ఎం.సూర్యకు విజయనగరం, శ్రీకాకుళం జిల్లా పలాసలో ఏఈగా పనిచేస్తున్న బి.రాజేష్‌కు విజయనగరం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి బదిలీ అయింది.

న్యూస్‌రీల్

డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా రవీంద్రనాథ్



విజయనగరం టౌన్: విజయనగరం డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా గూడూరు ఆర్టీఓగా పనిచేస్తున్న జి.ఆర్.రవీంద్రనాథ్ పదోన్నతిపై రానున్నారు. ఈ మేరకు శుక్రవారం ఆదేశాలు అందాయి. 1988లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్‌గా రవాణా శాఖలో అడుగుపెట్టారు. ఆయన గతంలో అనకాపల్లి ఆర్టీఓగా పనిచేశారు. ఇక్కడ ఆర్టీఓగా విధులు నిర్వహిస్తున్న జి.ఆదినారాయణ గూడూరు ఆర్టీఓగా బదిలీ అయ్యారు.

త్వరితగతిన నాడు-నేడు పనులు



రేగిడి ఎమ్మార్సీ కార్యాలయంలో నాడు-నేడు పనులపై సమీక్షిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మనబడి నాడు-నేడు పథకం రెండో విడత పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.లింగేశ్వరరెడ్డి సూచించారు. రేగిడి ఎమ్మార్సీలో నాడు-నేడు పనులపై హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12 నాటికి ప్రతీ పాఠశాలలో పది కాంపోనెంట్‌లకు సంబంధించి అన్ని పనులను సక్రమంగా, త్వరగా జరిగేలా చూడాలని సూచించారు. ఏయే పాఠశాలల్లో మిగులు నిధులు ఉన్నాయో, ఏయే పాఠశాలలకు ఎంత నిధులు అవసరమో సత్వరమే నివేదిక అందజేయాలన్నారు. పాఠశాలల ప్రారంభోత్సవం నాటికి అన్ని పాఠ్యపుస్తకాలను అందజేయాలని ఎంఈఓ ఎం.వి. ప్రసాదరావును ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.మురళీమోహన్, సీఆర్పీలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



డీఎంహెచ్‌ఓ భాస్కరరావుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ)గా డాక్టర్ ఎస్.భాస్కరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఆంధ్రా మెడికల్ కాలేజ్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు ఆయన వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీల సేవలు ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవలు సమర్థవంతంగా అమలయ్యేలా చూస్తానని చెప్పారు. మాతా, శిశు మరణాలు తగ్గించేందుకు సిబ్బందితో కలిసి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు.

సప్లిమెంటరీ పరీక్షకు 1052 మంది హాజరు

విజయనగరం పూల్‌బాగ్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం 33 పరీక్ష కేంద్రాల్లో జరిగిన పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలు (తెలుగు) ప్రశాంతంగా జరిగాయి. 1334 మంది విద్యార్థులకు 1052 మంది హాజరుకాగా, 282 మంది గైర్హాజరైనట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. స్క్వాడ్ బృందాలు 14 కేంద్రాలను, డీఈఓ రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు.

రైలు ప్రమాద బాధితులను ఆదుకుంటాం

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: ఒడిశాలో కోరమండల్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లు శుక్రవారం రాత్రి పట్టాలు తప్పాయి. సుమారు 13 భోగీలు పట్టాలు తప్పగా, నాలుగు భోగీలు పూర్తిగా ఛిద్రమయ్యాయి. 50 మందికిపైగా మృతిచెందగా, 179 మందికి పైగా గాయాలపాలైనట్టు ప్రాథమిక సమాచారం. ఒడిశా ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. బాధితుల సమాచారం తెలుసుకునేందుకు విజయనగరం రైల్వేస్టేషన్‌లో టోల్ ఫ్రీనెంబర్ల 08922-221202, 221206 నంబర్లను అందుబాటులో ఉంచారు. ప్రమాదంతో పలు రైళ్లను రద్దుచేశారు. రైలు ప్రమాద బాధితుల్లో జిల్లాకు చెందిన వారు ఎవరైనా ఉంటే వారికి అండగా ఉంటామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. రైలు ప్రమాదం చోటుచేసుకోవడం చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

సాగు సులభం.. రైతుకు ఆదాయం



వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రైతు గ్రూపులకు రాయితీపై అందజేసిన ట్రాక్టర్లు

- వ్యవసాయంలో యాంత్రీకరణకు ప్రభుత్వ ప్రోత్సాహం
- రైతులకు రాయితీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు
- కూలీలు, సాగు ఖర్చు తగ్గించడమే లక్ష్యం
- తొలిరెండు విడతల్లో 335 ట్రాక్టర్ల అందజేత
- ట్రాక్టర్ల విలువ రూ.43.65 కోట్లు
- ప్రభుత్వ రాయితీ రూ.13.88 కోట్లు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వ్యవసాయం దండగ అన్న టీడీపీ అధినేత చంద్రబాబు మాదిరిగా గాకుండా వ్యవసాయాన్ని పండగ చేయాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టింది మొదలు నాలుగేళ్లుగా రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేయడంలో భాగంగా సాగులో యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నారు. సాగుఖర్చు తగ్గించడంతో పాటు కూలీల కొరత సమస్యను అధిగమించేందుకు అవసరమైన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను రాయితీపై అందిస్తున్నారు. దీనివల్ల దుక్కి దున్నే పని మొదలు దమ్ము, నాట్లు, కోత, నూర్పిడి వరకూ అన్ని పనులూ యంత్రాలతో సులభంగా, తక్కువ ఖర్చుతో చేయడానికి వీలు కలుగుతోంది. కూలీల సమస్య తీరడమే గాక సమయానుకూలంగా సాగు పనులను రైతులు పూర్తిచేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు.

ఆర్‌బీకే కేంద్రంగా...

వైఎస్సార్ రైతు భరోసా కేంద్రా (ఆర్‌బీకే)లకు అనుబంధంగా కస్టమ్ హైరింగ్ సెంటర్ల (సీహెచ్‌సీ)ను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. వైఎస్సార్ యంత్రసేవా పథకం కింద రైతు గ్రూపులకు సాగు పరికరాలను సమకూర్చుతోంది. సీహెచ్‌సీలో సభ్యులైన రైతులు 10 శాతం వాటాగా చెల్లిస్తే సరిపోతోంది. ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తోంది. మిగతా 50 శాతం మొత్తాన్ని బ్యాంకు రుణం కింద సమకూర్చుతోంది.



ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ

పండగలా యంత్రసేవా పథకం...

వైఎస్సార్ యంత్ర సేవా పథకం రైతులకు ఒక పండగ వాతావరణాన్ని తీసుకొస్తోంది. విజయనగరం జిల్లాలో మొదటి, రెండు విడతల్లో 335 ట్రాక్టర్లను ప్రభుత్వం సీహెచ్‌సీలకు అందించింది. మొదటి విడతలో 212 ట్రాక్టర్లు, రెండో విడతలో 123 ట్రాక్టర్లు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. మొదటి విడతలో 326 గ్రూపులకు, రెండో విడత 184 గ్రూపులకు యంత్ర పరికరాలను జిల్లా అధికారులు అందజేశారు. మొదటి విడతలో అందించిన యంత్ర పరికరాల విలువ రూ.28.45 కోట్లు. ప్రభుత్వం రూ.9.34 కోట్ల రాయితీని అందించింది. అలాగే, రెండో విడతలో అందించిన పరికరాల విలువ రూ.15.10 కోట్లు. అందులో రూ.4.54 కోట్ల మేర ప్రభుత్వం రాయితీ ఇచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ విడతలో 78 ట్రాక్టర్లు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రోటావేటర్లు, వరి నూర్పిడి యంత్రాలు, మొక్కజొన్న నూర్పిడి యంత్రాలు, స్ప్రేయర్లు, పవర్ వీడర్లు, వరి కోత యంత్రాలు, ట్రాక్టర్ ఆధారిత ఇతర వ్యవసాయ యంత్ర పరికరాలు ఇవ్వడం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి.

విజయనగరం జిల్లాలో పంపిణీ చేసిన ట్రాక్టర్ల సంఖ్య

నియోజకవర్గం	మొదటి విడత	రెండో విడత
బొబ్బిలి	36	23
గజపతినగరం	35	25
చీపురుపల్లి	25	12
రాజాం	29	27
విజయనగరం	12	1
నెల్లిమర్ల	29	11
ఎస్.కోట	46	24

పార్వతీపురం మన్యం జిల్లాకు అందించిన ట్రాక్టర్లు

నియోజకవర్గం	రెండో విడత
సాలూరు	14
పార్వతీపురం	18
కురుపాం	21
పాలకొండ	25

టీడీపీ ప్రభుత్వ హయాంలో తమ్ముళ్లకే...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతు రథం పేరిట ట్రాక్టర్లు రైతులకు ఇస్తామని నాయకులు ప్రకటించినా తీరా అమల్లోకి వచ్చేసరికి అవన్నీ ఆ పార్టీ కార్యకర్తలకే అందాయి. రాజకీయాలకు అతీతంగా సామాన్య రైతులకు ఒక్క ట్రాక్టర్ కూడా ఇవ్వకపోవడంతో అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే. ఆ ట్రాక్టర్లను కూడా కొంతమంది టీడీపీ నాయకులు తీసుకున్నట్లే తీసుకొని వేరొకరికి అమ్మకం పెట్టేశారు. ప్రభుత్వ రాయితీని కొల్లగొట్టేశారు. మళ్లీ అలాంటి అక్రమాలు పునరావృతం గాకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వ్యక్తిగతంగా గాకుండా రైతులను గ్రూపులుగా చేసి ఆర్‌బీకేలకు అనుబంధంగా ట్రాక్టర్లను సమకూర్చుతోంది. అసలైన రైతులకు ప్రయోజనం కల్పిస్తోంది.

రైతు రాజుగా ఉండాలన్నదే ధ్యేయం



ట్రాక్టర్ మెగా తాళాన్ని రైతు గ్రూపునకు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- యంత్ర సేవా మెగా మేళాలో రూ.15.2 కోట్ల విలువైన యంత్రాల పంపిణీ
- జెండా ఊపి ట్రాక్టర్లను ప్రారంభించిన మంత్రి బొత్స

విజయనగరం ఫోర్ట్: రైతు రాజుగా ఉండాలని దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆకాంక్షించేవారని, ఇప్పుడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు అవసరాలు తీర్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. తండ్రి ఆశయాన్ని నెరవేర్చుతున్నారన్నారు. విజయనగరం కోట వద్ద వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా 123 ట్రాక్టర్లను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతును ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. దుక్కి దున్నే ట్రాక్టర్ల నుంచి కోత యంత్రాల వరకు రైతులకు రాయితీపై అందజేస్తోందని తెలిపారు.

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక్కో రైతు భరోసా కేంద్రానికి రూ.15 లక్షల విలువైన యంత్ర పరికరాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. దీనివల్ల రైతులకు అద్దె కష్టాలు తప్పుతాయని, సాగు సులభమవుతుందని పేర్కొన్నారు. గతంలో చంద్రబాబునాయుడు ఉచిత విద్యుత్ గురించి తీగెలపై దుస్తులు ఆరబెట్టుకోవాలంటూ అపహేళనగా మాట్లాడేవారన్నారు. ప్రస్తుత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతులకు 9 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తోందని తెలిపారు.
- కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. రైతులకు తక్కువ ధరకే యంత్రాలు సమకూర్చుతోందని చెప్పారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసినట్టు వెల్లడించారు. పురుగు మందును డ్రోన్లతో పిచికారీ చేయడంపై 20 మందిని శిక్షణకు పంపించామన్నారు. గత ఏడాది 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందన్నారు.
- ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లడుతూ చంద్రబాబు వ్యవసాయం దండగఅంటే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పండగలా మార్చారన్నారు. రాష్ట్రంలో 15 వేల సచివాలయాలను ఏర్పాటు చేసి, రైతులకు సేవలందించేలా ప్రతి సచివాలయానికి ఒక గ్రామ వ్యవసాయ సహాయకుడిని నియమించారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపాడపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన, సహాయ కలెక్టర్ త్రివినాగ్, జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం ట్రాక్టర్



సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మాకు ట్రాక్టరు అందించారు. అదే గత టీడీపీ ప్రభుత్వ పాలనలో మేము ఎంత బతిమాలుకున్నా ప్రయోజనం లేకపోయింది. ఇప్పుడు ఎవ్వరినీ అడగాల్సిన పనిలేదు. గ్రామ వ్యవసాయ సహాయకులే మా దగ్గరకు వచ్చి రైతులంతా గ్రూపుగా ఏర్పడమని చెప్పారు. మా గ్రూపుకు ట్రాక్టరు వచ్చేలా దరఖాస్తు చేయించారు.

– ఉమామహేశ్వరరావు, రైతు, ఆలుబిల్లి గ్రామం, వంగర మండలం

సంతోషంగా ఉంది



మాలాంటి సామాన్య రైతులకు ఇప్పటివరకూ ట్రాక్టరుతో పనిచేయించాలంటే వ్యయప్రయాసలు తప్పేవికావు. ఇప్పుడు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ట్రాక్టర్ ఇచ్చింది. మాకు చాలా సంతోషంగా ఉంది. మాగ్రూపు సభ్యులతో పాటు గ్రామ రైతు భరోసా కేంద్రం పరిధిలో ఉన్న రైతులకు ట్రాక్టర్‌ను వినియోగిస్తాం.

– పాగిరి శ్రీరాములు, రైతు, రేగిడి

జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతి



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతి. ఏదిఏమైనా ఎంత భారమైనా వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏటా రైతులకు రూ.13,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నారు. మాలాంటి రైతులకు విత్తనాలు, ఎరువులు కొనుగోలుకు డబ్బులు ఉపయోగపడుతున్నాయి. కూలీల కొరత ఉన్న పరిస్థితుల్లో ట్రాక్టర్ ఇవ్వడం మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– వంగపండు శ్రీరామమూర్తి, రైతు, తెర్లాం

ఆపన్న హస్తం

- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన కేన్సర్ బాధిత బాలిక తల్లిదండ్రులు



భోగాపురం ఎయిర్‌పోర్టులో సీఎం జగన్‌మోహన్ రెడ్డికి పాప పరిస్థితిని వివరిస్తున్న తల్లి లావణ్య (ఫైల్)

రేగిడి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తమ కుటుంబాన్ని దేవుడిలా ఆదుకున్నారని కందిశ గ్రామానికి చెందిన కేన్సర్ బాధిత బాలిక గంటి హేమలత తల్లిదండ్రులు కన్నబాబు, లావణ్యలు తెలిపారు. గత నెల 3వ తేదీన విజయనగరం జిల్లా భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు వచ్చిన సమయంలో వావిలవలస గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త పాలూరి సిద్దార్థ సహాయంతో హేమలత పరిస్థితిని ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఆయన మానవతా దృక్పథంతో స్పందించి పాపకు మెరుగైన వైద్యం అందించి అన్ని విధాలుగా ఆదుకుంటామని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారంగా ఇటీవల లక్ష రూపాయలను కుటుంబానికి అందజేశారు. హేమలతకు చికిత్స అందించేందుకు విశాఖపట్నం ప్రసాద్ ఐ ఆస్పత్రికి శుక్రవారం తీసుకెళ్లారు. పాప వైద్యం కోసం రూ.38 వేలు ఖర్చు అయిందని, ఆ డబ్బులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డే కడతారని, మీరు ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దని ఆస్పత్రి వర్గాలు తెలియజేసినట్టు లావణ్య, కన్నబాబు ఆనందం వ్యక్తం చేశారు. సీఎం మేలు మరచిపోలేమన్నారు.

బడుగు జీవుల గొప్ప మనస్సు

- నేత్ర, అవయవదానానికి 150 మంది అంగీకారం

చీపురుపల్లి: వారంతా బడుగు జీవులు. ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ నాలుగు రూపాయలు కూడబెట్టుకుని జీవనం సాగిస్తున్నవారు. పెద్దగా చదుకున్న వారు కాదు.. పెద్దపెద్ద పట్టణాల్లో పుట్టిపెరిగిన వారూ కాదు... అయితేనేం అన్నింటికి మించిన సామాజిక స్పృహ వారిలో ఉంది. బతికున్నప్పుడే కాదు మరణానంతరం సమాజానికి ఉపయోగపడాలనే గొప్పమనస్సుతో దాదాపు 150 మంది ఉపాధిహామీ వేతనదారులు మరణానంతరం నేత్ర, అవయవదానం చేసేందుకు అంగీకారం తెలిపారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు బి.వి.గోవిందరాజులు అవగాహన కల్పించడంతో పట్టణంలోని కొత్తఅగ్రహారం, జి.అగ్రహారానికి చెందిన వీరంతా అవయవదానానికి సంబంధించిన అంగీకార పత్రాలు అందజేశారు. అనంతరం అవయవ దానంపై ప్రతిజ్ఞ చేశారు.

వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ ప్రారంభోత్సవం



చినజియర్‌స్వామి ఆధ్యాత్మిక ఉపన్యాసాన్ని వింటున్న మంత్రి బొత్స దంపతులు, ఎంపీ బెల్లాన, ధర్మకర్తలు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని బంగారమ్మకాలనీలో శుక్రవారం వేణుగోపాల స్వామి ఆలయ ప్రారంభోత్సవం వైభవంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణాలతో వేణుగోపాలస్వామి, గోదాదేవి, భగవద్రామానుజాచార్యుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఇరిగేషన్ డైరెక్టర్, ఆలయ ధర్మకర్త బమ్మిడి అప్పలస్వామి, కష్ణమ్మ దంపతులు, ఆలయ కమిటీ సభ్యుల నేతత్వంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు సాగాయి. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజియర్‌స్వామి, రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి దంపతులు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వందలాదిమంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయంలో చినజియర్ స్వామి ప్రత్యేక పూజలు జరిపి వేణుగోపాలస్వామి విశిష్టతను భక్తులకు వివరించారు. మంత్రి బొత్స దంపతులకు, భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

చంద్రబాబుది డూప్లికేట్ మేనిఫెస్టో..

- ఎన్నికల సమయంలోనే బాబుకు ప్రజలు గుర్తుకువస్తారు
- అబద్ధపు హామీలు నమ్మి మోసపోవద్దు
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



పెదనడిపల్లిలో రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: అబద్ధపు హామీలు, డూప్లికేట్ మేనిఫెస్టోతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వస్తున్నారని, ఆయన మాటలు నమ్మి మోసపోవద్దని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదనడిపల్లిలో రైతుభరోసా కేంద్రాన్ని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో కలసి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రజల కోసం ఆలోచించలేదన్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు రానుండడంతో ప్రజలను మోసం చేసేందుకు తప్పుడు మేనిఫెస్టోలతో వస్తున్నాడని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 98.5 శాతం అమలు చేశారని గుర్తుచేశారు. 2014లో చంద్రబాబునాయుడు ఇచ్చిన 600 హామీల మేనిఫెస్టోను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బెవర ఉమ, పీఏసీఎస్ అధ్యక్షుడు పిసిని శ్రీను, సర్పంచ్ సూర పోలరాజ్, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దన్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, కరిమజ్జి శ్రీనివాసరావు, అధికార్ల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ ఉన్న పంటల సాగు లాభదాయకం

- జిల్లా అధికారులకు వ్యవసాయ శాఖ కమిషనర్ అరుణ్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్

విజయనగరం అర్బన్: ప్రజా మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆహార పంటల సాగు లాభదాయకమని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ అరుణ్‌కుమార్ జిల్లా అధికారులను ఆదేశించారు. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలన్నారు. జిల్లాకు శుక్రవారం వచ్చిన ఆయన జేసీ చాంబర్‌లో జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పంటల సాగు, విత్తనాల సరఫరా, ధాన్యం కొనుగోలు, బిల్లుల చెల్లింపు, బీమా పరిహారాల అందజేత తదితర అంశాలపై చర్చించారు. గత సీజన్ నుంచి ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ, ప్రజాపంపిణీ వ్యవస్థ పనితీరును జేసీ మయూర్‌అశోక్ వివరించారు. గత సీజన్లో జరిగిన ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి రవాణా భత్యంను చెల్లించాలని సివిల్ సప్లయి డీఎంను ఆదేశించారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు, చిరుధాన్యాల సాగుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. ముందుగా విజయనగరం మండలం కొండకరకాంలోని గోధు పిండి మిల్లును పరిశీలించారు. సమావేశంలో జేసీ కె.మయూర్‌అశోక్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామారావు, డీఎస్‌ఓ మధుసూదనరావు, సహకార అధికారి రమేష్, వ్యవసాయ పరిశోధన కేంద్ర శాస్త్రవేత్తలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నాగుపాము హతం


హతమార్చిన నాగుపాము

సీతానగరం: మండలకేంద్రం లోని కమలా తోటకాలనీలో కోడిగుడ్ల కోసం కోళ్లగూడులో చొరబడిన నాగుపాము ఇంటి యజమాని కంటపడడంతో హతమార్చాడు. శుక్రవారం ఉదయం గ్రామానికి చెందిన వై గోవిందరావు ఇంటివద్ద కోళ్లగూడులో గుడ్ల కోసం నాగుపాము చొరబడింది. కోళ్లగూడు నుంచి శబ్దం రావడంతో పాము చొరబడుతున్నట్లు గుర్తించిన ఇంటియజమాని బయటకు పంపించడానికి ప్రయత్నం చేసినా శబ్దం చేయడంతో ఫలితం కానరాలేదు. దీంతో కర్రతో హతమార్చారు.

మూడు గొర్రెలు సజీవ దహనం

- రెండు పశువుల శాలలు దగ్ధం


అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన గొర్రెలు, పశువులు శాలలు

బొండపల్లి: మండలంలోని ఒంపల్లి గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు పశువులు దగ్ధం కావడంతో పాటు మూడు గొర్రెలు సజీవ దహనమయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గొర్లె గౌరినాయుడు తన పశువులు, గొర్రెలను వేర్వేరు శాలల్లో కట్టి ఉంచగా అకస్మాత్తుగా జరిగిన అగ్రిప్రమాదంలో రెండు పశువుల శాలలు కాలిపోగా ఒకదానిలో ఉన్న మూడు గొర్రెలు పూర్తిగా, మరో మూడు పాక్షికంగా కాలిపోయాయి. అలాగే ఇదే ప్రమాదంలో శాలలో ఉంచిన సైకిల్‌తో పాటు రెండు పశువుల శాలలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి.అగ్ని మాపక వాహనానికి సమాచారం ఇచ్చే లోగానే పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదంలో కాలిపోయిన రెండు శాలలతో పాటు గొర్రెలకు సంబంధించి ప్రభుత్వం నష్టపరిహారం అందచేసి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పాము కాటుతో వ్యక్తి మృతి


మృతిచెందిన కిశోర్

పార్వతీపురం: గుమ్మలక్ష్మీపురం మండలం డొంగరి కెక్కువ గ్రామానికి చెందిన కోలక కిశోర్ పాము కాటు వేయడంతో శుక్రవారం మృతి చెందాడు. పొలానికి వెళ్లిన కిశోర్ పాము కాటుకు గురయ్యాడు. దీంతో వెంటనే కురుపాం పీహెచ్‌సీకి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. స్థానిక అయ్యన్నపేట కామాక్షీనగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్న నిర్మల (60) గత నెల 30వ తేదీన ఇంటి నుంచి బయటకు పెరుగు ప్యాకెట్ కొనుగోలు చేసేందుకు వచ్చింది. రామవరం నుంచి విజయనగరం వైపు వస్తున్న క్యాబ్ ఆమెను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్సై మురళి చెప్పారు.

రెంటికీ చెడ్డ రేవడిలా..!


పెదరావుపల్లి గ్రామం ముఖచిత్రం

- రెండు జిల్లాల నడుమ నలిగిపోతున్న రైతులు
- అధికారుల పొరపాటు.. రైతుల గ్రహపాటు
- కొండపోరంబోకుగా 194 ఎకరాల జిరాయితీ భూముల నమోదు
- దశాబ్దాలుగా అందని రుణాలు, ప్రభుత్వ పరిహారం

కొత్తవలస: శతాబ్దం క్రితం జరిగిన పొరపాటు ఆగ్రామ రైతుల పాలిట శాపంగా మారడంతో నేటికీ అవస్థలు పడుతున్నారు. వంద సంవత్సరాలుగా వరి, జీడి, మామిడి, కొబ్బరి పంటలు సాగు చేసుకుంటున్న భూములను కొండ పోరంబోకుగా రికార్డుల్లో నమోదు చేయడంతో క్రయ దస్త్రావేజులుండీ హక్కులు లేక ఆవేదన చెందుతున్నారు. ఆనాటి పొరపాటును సరి చేయాలని దశాబ్దాలుగా ప్రభుత్వాధికారులు, పాలకుల చుట్టూ తిరుగుతునే ఉన్నారు. అసలు ఆగ్రామం ఏ జిల్లా, ఏ మండలం పరిధిలోకి వస్తుందో తెలియక క్షేత్రస్థాయిలో అధికారులు కూడా తలలు పట్టుకుంటున్నారు. కొత్తవలస మండలంలోని కాటకాపల్లి పంచాయతీ పెదరావుపల్లి గ్రామ పరిస్థితి ఇది. పెదరావుపల్లి గ్రామం విశాఖ, విజయగనరం జిల్లాల మధ్య ఉంది.ఈ గ్రామం పరిధిలో 868.75 ఎకరాల భూమి ఉంది. స్వాతంత్ర్యం రాక ముందు 1902వ సంవత్సరంలో జరిగిన భూ సర్వేలో ఈ గ్రామ రెవెన్యూ పరిధిలోని కొంత భాగాన్ని శృంగవరపుకోట తాలుకా నుంచి భీమునిపట్నం తాలుకాకు మార్చాలనే ఉద్దేశంతో అప్పటి అధికారులు సర్వే ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు తమ గ్రామాన్ని శృంగవరపుకోట తాలూకాలోనే ఉంచాలని పట్టుబట్టి అప్పటి సర్వేకు సహకరించలేదు. దీంతో అప్పట్లో సర్వే అధికారులు 674.75 ఎకరాల భూమిని శృంగవరపుకోట తాలూకాలో చూపించి, మిగిలిన పెదరావుపల్లి గ్రామాన్ని, ఆ గ్రామ రైతులు సాగు చేస్తున్న 194 ఎకరాల సాగు భూమిని భీమునిపట్నం తాలూకాలోని పద్మనాభం మండలంలో సర్వే నంబర్-1లో కొండపోరంబోకుగా నమోదు చేసేశారు.

పొరపాటును అధికారులు గుర్తించినా..

గ్రామంలో అప్పట్లో జరిగిన సర్వే తప్పిదాన్ని మళ్లీ 1965లో జరిగిన రీ సర్వేలో అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి సమస్య పరిష్కరించాలని గ్రామ రైతులు అధికారులు, పాలకుల చుట్టూ తిరిగినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.

వైఎస్సార్ జగనన్న భూ సర్వేతో కదలిక

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న భూ సర్వేతో ఆ గ్రామ సమస్యలో కదలిక మొదలైంది. స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చొరవతో ఆ గ్రామ ఎంపీటీసీ కిలపర్తి అప్పలపరిదేశినాయుడు, పెంట అప్పారావు, పెంట జగ్గునాయుడు, బాదిరెడ్డి అప్పారావు తదితరుల ఆధ్వర్యంలో గ్రామ రైతులు ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేలో సమస్యను లేవనెత్తి జిల్లా మాజీ కలెక్టర్ ఎ.సూర్యకుమారి దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆమె కొత్తవలస తహసీల్దార్ కార్యాలయానికి, జిల్లా సర్వే డిపార్ట్‌మెంట్‌కు లేఖలు రాసి సమగ్ర సర్వే నిర్వహించి నివేదికలను అందించాలని కోరారు. ఈ మేరకు నిర్వహించిన సర్వేలో పెదరావుపల్లి గ్రామంలో రైతులు సాగుచేస్తున్న భూములు మొత్తంగా 194 ఎకరాలుగా అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ భూమి విశాఖ జిల్లా, పద్మనాభం మండలం, కొవ్వాడ గ్రామం సర్వే నంబర్-1లో కొండపోరంబోకు భూములుగా నమోదైనట్లు ధ్రువీకరించారు. ఈ భూములను విజయనగరం జిల్లా కొత్తవలస మండలం పెదరావుపల్లి గ్రామంలోకి చేర్చాలని ప్రధాన భూ పరిపాలన కమిషనర్‌కు గత కలెక్టర్ ఎం.సూర్యకుమారి రేఖా నంబర్ 876/2022-ఎ1తో గత సెప్టెంబర్-11న పంపించారు.ఈ నివేదికల ఆధారంగా సత్వరం న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వాస్తవంగా పెదరావుపల్లి గ్రామానికి సంక్షేమ,అభివృద్ధి పనులకు నిధులు విజయనగరం జిల్లా కొత్తవలస మండలం నుంచే అదుతున్నాయి.విశాఖ జిల్లా పద్మనాభం మండలానికి పెదరావుపల్లి గ్రామానికి ఎటువంటి సంబంధం లేదు. ఈ గ్రామం పరిధిలో సంభవించే క్రిమినల్, సివిల్ కేసులు ఎక్కడ నమోదు చేయాలో తెలియక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. తమకు దశాబ్దాల పాటు రుణాలు గాని, ప్రభుత్వం నుంచి వచ్చే పరిహారాలు కూడా అందడం లేదని వాపోతున్నారు.

పూర్తిస్థాయిలో సహకరిస్తాం



పెదరావుపల్లి గ్రామం భూములకు సంబంధించి రైతులకు జరిగిన అన్యాయాన్ని గుర్తించాం.ఇప్పటికే రైతుల అభ్యర్థన, కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే నిర్వహించాం. సుమారు 8 ఎకరాల్లో గ్రామకంఠం, 184 ఎకరాల సాగు భూమి ఉన్నట్లు గుర్తించాం. ఈ భూములు ప్రస్తుతం విశాఖ జిల్లా పద్మనాభం మండలం, కొవ్వాడ రెవెన్యూపరిధిలోని సర్వే నంబర్-1లో కొండపోరంబోకు భూములుగా ఉన్నట్లు గుర్తించాం. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశాం.

– జి.హేమంత్‌కుమార్, తహసీల్దార్, కొత్తవలస మండలం

సీఎం సహాయ నిధి.. పేదల పాలిట పెన్నిధి

- ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు
- బాధితులకు చెక్కుల పంపిణీ


కొండవెలగాడకు చెందిన బాధిత కుటుంబానికి రూ.2లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

నెల్లిమర్ల రూరల్: సీఎం సహాయ నిధి ఆపదకాలంలో పేదల పాలిట పెన్నిధిలా నిలుస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు అన్నారు. ఈ మేరకు మండలంలోని మొయిద గ్రామంలో ఆయన స్వగృహంలో పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. కెల్ల గ్రామానికి చెందిన పాపయ్యమ్మకు రూ.95వేలు, కొండవెలగాడ గ్రామానికి చెందిన బూటి సూరిబాబుకు రూ.2లక్షలు, మొయిద గ్రామానికి చెందిన శినగం ధమయంతికి రూ.లక్ష చొప్పున మంజూరు కాగా ఆ చెక్కులను బాధితుల కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతం ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ పేదరికంతో బాధపడుతూ తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్న వారికి సీఎం సహాయ నిధి కొండంత అండగా నిలుస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. అనంతరం చెక్కులు అందుకున్న బాధితులు ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్సను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, డీసీసీబీ వైస్‌చైర్మన్ చనమల్లు వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి సీఎం సహాయనిధి

వీరఘట్టం: పాలకొండ మండలం తంపటాపల్లి గ్రామానికి చెందిన అల్లు ఈశ్వరమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబం పెద్ద దిక్కు కోల్పోయి రోడ్డున పడింది.ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి హామీ ఇచ్చారు. ఈ కుటుంబ పరిస్థితిని ఆమె ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.2.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.ఈ చెక్కును ఎమ్మెల్యే కళావతి వండవ క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చందక జగదీశ్వరరావు ఉన్నారు.

చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలకు స్పందన


విద్యార్థులకు నిర్వహించిన పోటీలను తిలకిస్తున్న పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం తదితరులు

విజయనగరం రూరల్: ఈ నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని గురజాడ గ్రంథాలయం ప్రాంగణంలో ఐదో తరగతి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు ఒక విభాగం, 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు మరో విభాగంగా పోటీలు నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థులు కాలుష్య నియంత్రణ, ప్లాస్టిక్ కాలుష్యం అంశాలపై నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపారు. రెండు విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5 నిర్వహించే కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని పర్యావరణ ఇంజినీర్ టి.సుదర్శనం తెలిపారు.

గ్రూప్-సి ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఆధ్వర్యంలో గ్రూప్-సి ఉద్యోగాలైన లోయర్ డివిజన్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయిందని జిల్లా ఉపాధి కల్పనాధికారిణి డి.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్ఎస్‌సీ.ఎన్ఐసి.ఐఎన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 8 చివరి తేదీ అని తెలిపారు. ఈ నెల 10 లోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 10 కేంద్రాల్లో ఆగస్టు నెలలో పరీక్ష జరుగుతుందని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుమిలిలో మైనింగ్ ప్రాంతం పరిశీలన

- రెవెన్యూ భూములే అంటున్న ఆ శాఖ అధికారులు
- సర్వే చేసి నిర్ధారించాలంటున్న అటవీశాఖ అధికారులు


కుమిలిలో మైనింగ్ జరుగుతున్న ప్రాంతం మ్యాప్ పరిశీలిస్తున్న రెవెన్యూ, అటవీ, మైనింగ్ అధికారులు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి కొండ సర్వే నంబర్1లో మైనింగ్ జరుగుతున్న ప్రాంతాన్ని రెవెన్యూ, అటవీ, మైనింగ్‌శాఖల అధికారులు సంయుక్తంగా శుక్రవారం పరిశీలించారు. గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని ఫారెస్ట్ రేంజర్ పి.అప్పలరాజు, సర్వే ఇన్‌స్పెక్టర్ జ్ఞానేశ్వరరావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, సెటిల్‌మెంట్ అధికారి కె.వెంకటరమణ, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ శ్యాం పీటర్‌ల బృందం పరిశీలించి క్వారీయింగ్ జరిగిన ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు. కుమిలి కొండ సర్వే నంబర్ 1లో 428.70 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. దానిలో కొంత మేర నిబంధనల మేరకు మైనింగ్‌కు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి, సిరుగుడు గోవిందరావు పేరిట 2.5 హెక్టార్లు, దల్లి గౌతమరెడ్డి పేరిట 7 హెక్టార్లకు మైనింగ్‌కు అనుమతులు ఇచ్చారు. వాటిలో ఫారెస్టు అధికారులు ఫారెస్టుశాఖకు చెందిన భూములలో కొంత మేర తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు చేశారు. దీనిపై పూసపాటిరేగ తహసీల్దార్ ఇ.భాస్కరరావు స్పందిస్తూ మైనింగ్ జరుగుతున్న భూములు అనుమతులు వున్న రెవిన్యూశాఖకు సంబంధించినవేనని, ఫారెస్టు అధికారులు ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపిస్తున్నారన్నారు. గెజిట్‌లో ఫారెస్టు భూములుగా ఉన్నాయని అని, రికార్డుల్లో రెవెన్యూ భూములుగా ఉన్నాయని అధికారులు తెలియజేశారు. సర్వే పూర్తయితే ఫారెస్టు, రెవెన్యూశాఖలకు సంబంధించిన భూములకు క్లారిటీ వచ్చే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఈ పరిశీలనలో మండల సర్వేయర్ గణపతిరావు, అటవీశాఖ బీట్ అధికారి సమత తదితరులు ఉన్నారు.

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- కలెక్టర్ నిషాంత్ కుమార్


కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను సత్కరించిన జిల్లా అధికారులు

పార్వతీపురంటౌన్: సమష్టి కృషితో అన్ని రంగాల్లో పార్వతీపురం మన్యం జిల్లా ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ పిలుపునిచ్చారు. జాతీయస్థాయిలో జిల్లా అవార్డులు సాధించినందుకుగాను గురువారం రాత్రి స్థానిక రాయల్ కన్వెన్షన్ సెంటర్‌లో కలెక్టర్‌ను జిల్లా అధికారుల సంఘం సన్మానించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన జిల్లాలో కనీస వసతులతో ప్రస్థానం ప్రారంభించి, సంవత్సర కాలంలో జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులు సాధించామన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే స్ఫూర్తితో పనిచేసి జిల్లాను అభివృద్ధి బాటలో కొనసాగించాలని కోరారు.

జిల్లాలో మంచి టీమ్ ఉంది

జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు మాట్లాడుతూ కలెక్టర్‌తో కలిసి పనిచేసిన అనుభవం ఉందని, ఏదైనా పని పూర్తి చేయడానికి ఆయన రూపొందించే ప్రణాళికలే కీలకమని, సమస్యలను లోతుగా అధ్యయనం చేసి పరిష్కారం కనుగొంటారని కొనియాడారు. ఎస్పీ విక్రాంత్ పటేల్ మాట్లాడుతూ కలెక్టర్ జిల్లాలో మంచి టీమ్ ఏర్పాటు చేశారని, కొత్తగా ఏర్పడిన, మారుమూల జిల్లాలో ఇటువంటి బృందంతో కలిసి ప్రజలకు సేవ చేసేఅవకాశం వచ్చినందుకు తనకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కుమార్, డీఎఫ్ఓ ప్రసన్న ప్రసంగిస్తూ జిల్లా అభివృద్ధికి కలెక్టర్ నాయకత్వం, ఆయన అందించిన సూచనలు, సలహాలు, సమస్యలపై ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించడం వల్ల సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.హేమలత, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ దేవుళ్ల నాయక్, జిల్లా పౌరసరఫరాల అధికారి మూర్తి, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి, డా.ఎంవీఆర్ కృష్ణాజీ, డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్ కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్ కుమార్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయగౌరి, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీరరాజు, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో మరో పతకం


కాంస్య పతకం చూపిస్తున్న వెయిట్ లిఫ్టర్ మణికంఠ

నెల్లిమర్ల రూరల్/విజయనగరం టౌన్: ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా వేదికగా జరుగుతున్న జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూనివర్సిటీ క్రీడల్లో జిల్లాకు మరో పతకం లభించింది. నెల్లిమర్ల మండలంలోని చంద్రంపేట గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ మొయిద మణికంఠ కాంస్య పతకం సాధించాడు. 89 కేజీల విభాగంలో శుక్రవారం జరిగిన పోటీల్లో పాల్గొన్న మణికంఠ స్నాచ్ 130 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 154 కిలోల చొప్పున బరువు ఎత్తి పతకం సాధించాడు. మణికంఠకు జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. విజయనగరంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో చదువుతున్న మణికంఠను కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ ఝాన్సీలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్‌వీ సాయిదేవమణి, ఫిజికల్ డైరెక్టర్ మహేష్ తదితరులు అభినందించారు.

సంగీత కళాశాల ప్రిన్సిపాల్‌గా శాస్త్రి


కేవీఎల్‌ఎన్.శాస్త్రి, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

విజయనగరం టౌన్: మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్‌గా కేవీఎల్ఎన్. శాస్త్రి బాధ్యతలు చేపట్టనున్నారు. కళాశాలలో వీణ లెక్చరర్‌గా పని చేస్తున్న ఆయన ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటివరకూ ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించిన డాక్టర్ మండపాక నాగలక్ష్మికి రాజమహేంద్రవరంలోని విజయ శంకర ప్రభుత్వ సంగీత కళాశాల రెగ్యులర్ ప్రిన్సిపల్‌గా పదోన్నతి లభించింది.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 510.00
విజయనగరం	రూ. 514.00
శ్రీకాకుళం	రూ. 514.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	60,930-00
బంగారం(22కే. 10గ్రా.)	55,850-00
వెండి (కిలో)	76,800-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹154	₹278	₹ 288

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రింగురోడ్డులో సాయి ఆలయం సమీపంలో సుమారు 30 ఏళ్ల నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానిక మహిళా పోలీసు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి అనారోగ్యంతో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని 108 వాహనంలో తరలించి కేంద్రాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని కేంద్రాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని ఎవరైనా గుర్తిస్తే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

ముగ్గురు మహిళల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ప్రయాణికుల ముసుగులో చోరీలకు పాల్పడిన ఘటనలో ముగ్గురు మహిళలను నెల్లూరు చిన్నబజారు పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు కేసు వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తికి చెందిన ఎ.లక్ష్మి ఈనెల 14వ తేదీన నెల్లూరుకు వచ్చారు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె గాంధీబొమ్మ నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ముగ్గురు గుర్తుతెలియని మహిళలు అదే ఆటోలో ఎక్కారు. లక్ష్మీకి చెందిన హ్యాండ్‌బ్యాగ్ తెరిచి రూ.3.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను అపహరించుకెళ్లారు. బస్టాండ్ వద్ద ఆటో దిగిన లక్ష్మికి బ్యాగ్‌లోని నగలు కనిపించక పోవడంతో చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నేతృత్వంలో ఎస్సై ఎ.సైదులు తన సిబ్బందితో కలిసి కేసు దర్యాప్తును ప్రారంభించారు. బాధితురాలు చెప్పిన ఆనవాళ్లు, సాంకేతికత ఆధారంగా నిందితురాళ్లు విజయనగరం జిల్లా కొత్తవలసకు చెందిన ఎం.సంధ్య, భాను, అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం, గొట్లం గ్రామానికి చెందిన ఆర్.వసంతగా గుర్తించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం వీఆర్ లా కళాశాల ఎదురుగా ఉన్న రహదారిపై అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరం అంగీకరించడంతో వారిని అరెస్ట్ చేసి రూ.3.80 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.